క్లుప్తంగా

జాగ్రత్తలు పాటించాలి

నెల్లికుదురు: అకాల వర్షాలు, ఈదురు గాలులతో విద్యుత్ తీగలు తెగడం, విద్యుత్ స్తంభాలు నేలమట్టం కావడంతో ప్రజలందరూ జాగ్రత్తలు పాటించాలని విద్యుత్‌శాఖ ఎస్‌ఈ జనగం నరేష్ బుధవారం తెలిపారు. వర్షాల సమయంలో తడిసిన స్తంభాలు, విద్యుత్ తీగలను ముట్టుకోవద్దని సూచించారు. విద్యుత్ సమస్యలు ఉంటే 1912 టోల్ ఫ్రీ నంబర్‌లో ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు.

ఒక్కపూట పనికి పరిమితం చేయాలి

తొర్రూరు: ఎండలు తీవ్రంగా ఉన్నందున మున్సిపాలిటీ కార్మికులను ఒక్క పూట పనికి పరిమితం చేయాలని టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి రవి కోరారు. ఈమేరకు టీయూసీఐ ఆధ్వర్యంలో బుధవారం డివిజన్ కేంద్రంలోని మున్సిపాలిటీ కార్యాలయంలో కమిషనర్ శాంతికుమార్‌కు వినతిపత్రం సమర్పించారు.

విద్యుత్ లైన్లకు మరమ్మతులు

మహబూబాబాద్ రూరల్: అకాల వర్షం, భారీ ఈదురుగాలులు, వడగళ్ల వానతో మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు కూలిపోయి, విద్యుత్ వైర్లు తెగిపోయాయి. దీంతో విద్యుత్ సరఫరాలకు అంతరాయం ఏర్పడింది. బుధవారం విద్యుత్ ఏఈ వెంకటేష్ ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ సిబ్బంది మరమ్మతు చేసి విద్యుత్‌ను పునరుద్ధరించారు.

దీప్తికి సన్మానం



మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో రోటరీ క్లబ్ మహబూబాబాద్ ఆధ్వర్యంలో అర్జున్ అవార్డు గ్రహీత, క్రీడాకారిణి దీప్తి జీవాంజిని క్లబ్ అధ్యక్షుడు గూడురు నాగేశ్వర్ రావు, కళాశాల ప్రిన్సిపాల్ పాక్కుల సదానందం, సభ్యులు బుధవారం సన్మానించారు. కార్యక్రమంలో నాగేష్‌కుమార్, బిక్కి వెంకటేశ్వర్లు, విజయ్‌కుమార్, నాగేందర్‌రావు, రమేశ్, గిరిధర్‌గుప్తా, నరసింహరావు పాల్గొన్నారు.

మార్కులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

మహబూబాబాద్ అర్బన్: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల సమ్మెటివ్-1,2 మార్కుల వివరాలను తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషన్ యాప్‌లో పొందుపర్చాలని జిల్లా విద్యాశాఖ అకడమిక్ మానటరింగ్ అధికారి ఆజాద్‌చంద్ర శేఖర్ ఉపాధ్యాయులకు సూచించారు. జిల్లా కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ బాలికల పాఠశాల, హనుమంతునిగడ్డ ప్రైమరీ పాఠశాల, నందినగర్ ప్రైమరీ పాఠశాలను ఆయన బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆజాద్ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. బేస్‌లైన్, మిడ్‌లైన్, ఎండ్‌లైన్ విద్యార్థుల లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు.కార్యక్రమంలో పాఠశాలల హెచ్‌ఎంలు వెంకటేశ్వర్లు, హల్యానాయక్, ఝాన్సీరాణి పాల్గొన్నారు.

రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

తొర్రూరు: నిర్దేశిత గడువులోపు ఆస్తి పన్ను చెల్లించేవారికి 5శాతం రాయితీ అవకాశం కల్పిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్ తెలిపారు. 5 శాతం పన్ను రాయితీపై బుధవారం డివిజన్ కేంద్రంలోని మున్సిపాలిటీ కార్యాలయంలో సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఈ నెల 30 వరకు ఆస్తి పన్ను చెల్లించే వారికి 5శాతం పన్ను రాయితీ వర్తిస్తుందన్నారు. పట్టణవాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రాజీవ్ యువ వికాసంపై సమావేశం

కేసముద్రం: కేసముద్రం, ఇనుగుర్తి మండల కేంద్రాల్లోని ఎంపీడీఓ కార్యాలయాల్లో రాజీవ్ యువ వికాసం పథకంలో భాగంగా బుధవారం జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసరావు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజీవ్ యువ వికాస్ స్కీంకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారు పంచాయతీ కార్యదర్శులకు హార్డ్ కాపీని సమర్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓలు క్రాంతి, హరిప్రసాద్, ఐకేపీ ఏపీఎం రాజీవ్, గణేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

భోగ్ బండార్ వేడుకలు

మరిపెడ రూరల్: మండలంలోని ఆనేపురం రెవెన్యూ పరిధిలోని వెంకట్‌తండా గ్రామ పంచాయతీ పరిధిలో మరిపెడ మాకుల జాతర సందర్భంగా బంజారుల ఆరాధ్యదైవం భోగ్ బండార్ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో లంబాడీల ఐక్య వేదిక రాష్ట్ర సమన్వయ కర్త జాదర్ రమేశ్ నాయక్, రిటైర్డ్ ఐఆర్‌టీఎస్ అధికారి భూక్య కస్నానాయక్, లంబాడీల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు జాదవ్ రాజ్‌కుమార్, ముఖ్య సమన్వయ కర్త కన్వీనర్ గుగులోతు రమేశ్‌నాయక్, గోర్ సభ జాతీయ అధ్యక్షుడు జైసింగ్ నాయక్, భావ్‌సింగ్ నాయక్ పాల్గొన్నారు.

15నెలలకు ఒకసారి వేతనం

- మిషన్ భగీరథ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల ఆవేదన

మహబూబాబాద్ అర్బన్: ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలనే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ రక్షిత మంచి నీటిని అందించాలనే ఉద్దేశంతో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం మిషన్ భగీరథను ప్రారంభించింది. సమగ్ర తాగునీటి పథకం ప్రతి గృహానికి నీరు అందించాలని రూపొందించారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ గోదావరి నది (53.68 టీఎంసీ), కృష్ణా నది (32.43 టీఎంసీ) నుంచి సేకరించిన నీటి ద్వారా రాష్ట్రంలోని అన్ని గృహాలకు స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేస్తుంది. అయితే రాష్ట్రవ్యాప్తంగా ఉన్నటువంటి 75 తాగునీటి పరీక్ష కేంద్రాల్లో సుమారు 375 మంది ఔట్ సోర్సింగ్ విధానంలో ఉద్యోగులు పనిచేస్తున్నారు. గత రెండు సంవత్సరాలుగా 15నెలలకు ఒకసారి జీతాలు పడుతున్నాయి. ప్రతి రోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు ల్యాబ్, జిల్లాలో వివిధ గ్రామాల్లో బోర్లు బావుల వద్ద నీటి పరీక్షలు చేస్తూ వెట్టిచాకిరీ చేస్తున్నారు. తీవ్రమైన ఒత్తిడితో అనారోగ్యానికి గురవుతున్నామని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



మహబూబాబాద్‌లో మిషన్ భగీరథ కార్యాలయం

మిషన్ భగీరథ ల్యాబ్‌లో అందులో 370మంది ఔట్ సోర్సింగ్ విధానంలో విధులు నిర్వహిస్తున్నారు. ఈ ఉద్యోగులు ప్రతినిత్యం గ్రామాల్లో తాగునీటి బోర్లు బావులు నల్లాలు, ఆర్వో వాటర్ ప్లాంట్‌లో నీటి నాణ్యత పరీక్షించి వాటి ఫలితాలు అధికారులకు అందజేస్తారు. నీటి నాణ్యత లేకపోతే సరఫరా ఆపివేస్తారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతున్న ఈ ఉద్యోగులకు మాత్రం నెలల తరబడి జీతాలు రాక మానసికంగా ఆందోళనకు గురవుతున్నారు. 15నెలలకు ఒకసారి వేతనం రావడంతో చాలీచాలని వేతనంతో కాలం వెళ్లబోస్తూ నెట్టుకొస్తున్నారు. ఇంటింటికీ మిషన్ భగీరథ నీటిని పరీక్షలు చేసి ప్రజల దాహార్తి తీరుస్తున్న ల్యాబ్ టెక్నీషియన్ల ఉద్యోగులకు సకాలంలో జీతాలు అందించి కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవాలని వారు కోరుకుంటున్నారు.

ప్రభుత్వానికి నివేదిక పంపాం..



మిషన్ భగీరథ కార్యాలయంలో ల్యాబ్‌లో ఔట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ఉద్యోగుల వేతనాల విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. కొద్ది రోజుల్లో వేతనాలు అందే అవకాశాలు ఉన్నాయి.

– కృష్ణారెడ్డి, మిషన్ భగీరథ ఈఈ

మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం

- ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్
- రూ.1.77 కోట్ల వడ్డీలేని రుణాల చెక్కుల పంపిణీ

మరిపెడ: మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వం లక్ష్యమని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రునాయక్ అన్నారు. బుధవారం మండలం కేంద్రంలోని ఆడిటోరియంలో వడ్డీలేని రుణాల చెక్కులను రూ.1.77కోట్లు మహిళా సమాఖ్య సంఘాలకు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అనంతరం మరిపెడ మహిళా సమాఖ్య మండల అధ్యక్షురాలు అజ్మీర వసంత శ్రీనివాస్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకే వడ్డీలేని రుణాలు అందజేస్తున్నామన్నారు. వందశాతం వడ్డీ రాయితీ రుణాల పథకాన్ని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేసిన వడ్డీని మహిళలకు చెల్లించడంతో విఫలమైందని విమర్శించారు. డోర్నకల్ నియోజక వర్గంలో రూ.8కోట్లు వడ్డీలేని రుణాలు అందించగా, అందులో మరిపెడ మండలానికి రూ.1.33కోట్లు, చిన్నగూడూరు మండలానికి రూ.0.44కోట్లు వడ్డీలేని రుణం కింద స్వయం సహాయక సంఘాలకు అందించామన్నారు. మహిళలను ఆర్థికంగా నిలదొక్కుకునేందుకే బ్యాంకు లింకేజీ, వడ్డీలేని రుణాలు, సోలార్ ప్లాంట్లు కింద మరిపెడకు రూ. 40 కోట్లు, చిన్నగూడూరుకు రూ.13 కోట్లు మహిళ పొదుపు సంఘాల సభ్యులకు అందించినట్లు తెలిపారు. అదేవిధంగా పెట్రోల్ బంకులను కూడా వారికి అందించి వారిని కోటీశ్వరులను చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో నాయకులు వంటికొమ్ము యుగేందర్‌రెడ్డి, నూకల అభినవ్‌రెడ్డి, మండల అధ్యక్షుడు పెండ్లి రఘువీరరెడ్డి, పట్టణ అధ్యక్షుడు తాజుద్దీన్, కేసముద్ర మార్కెట్ వైస్ చైర్మన్ పెద్దబోయిన ఐలమల్లు, గుగులోతు రవినాయక్, పానుగోలు రాంలాల్, గంధసిరి అంబరీష, మెంచ్ అశోక్, గంగయ్య, డీపీఎం గడ్డం శ్రీనివాస్, ఎంపీఎం బానోతు రాములు పాల్గొన్నారు.

మారెమ్మతల్లి విగ్రహ ప్రతిష్టాపన



మరిపెడ: రుణాల చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే రాంచంద్రునాయక్

మరిపెడ: మరిపెడ మున్సిపాలిటీ పరిధిలోని మాకులతండా సమీపంలో గల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం సమీపంలో నూతనంగా నిర్మించిన మారెమ్మతల్లి ఆలయంలో అమ్మవారిని ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో రామసహాయం సురేందర్‌రెడ్డి, నెహ్రూనాయక్, కస్నానాయక్, అభినవ్‌రెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

దంతాలపల్లి: రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రజలను, యువతులను, ఉద్యోగస్తులను అన్నిరంగాల్లో సమానంగా తీసుకెళ్తామని ప్రభుత్వ విప్ రామచంద్రునాయక్ అన్నారు. బుధవారం మండలంలోని పలుగ్రామాలలో అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సంపెట రాము, హౌజింగ్ బోర్డు పీడీ వీరన్న, పంచాయతీ రాజ్ డీఈ నర్సింగ్ నాయక్, తహసీల్దారు రాజేశ్వర్, ఎంపీడీఓ వివేక్‌రామ్, ఎంపీఓ అప్సర్ పాషా, ఆర్‌ఐ నజీముద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని మార్చే కుట్రను తిప్పికొట్టాలి

మరిపెడ రూరల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని మార్చే కుట్ర చేస్తోందని, అందరం కలిసి కట్టుగా తిప్పికొట్టాలని ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రునాయక్ అన్నారు. జై బాపు, జై బీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని వీరారం, ఉల్లెపల్లి గ్రామంలో రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రను ఎమ్మెల్యే ఆధ్వర్యంలో చేపట్టారు.

‘వక్ఫ్’పై తప్పుడు ప్రచారం మానుకోవాలి

మహబూబాబాద్ అర్బన్: ఉద్దేశపూర్వకంగా కొంత మంది వామపక్ష, ప్రతిపక్షనాయకులు వక్ఫ్ సవరణలపై తప్పుడు ప్రచారం మానుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎడవెల్లి రాజవర్ధన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. వక్ఫ్ బిల్లు నిరుపేద ముస్లింలకు, వితంతులకు మేలు జరుగుతుందన్నారు. వక్ఫ్ భూ బాధితుల్లో ముస్లింలు, హిందువులతోపాటు అన్ని వర్గాల ప్రజలు ఉన్నారని, గతంలో ఉన్న వక్ఫ్ చట్టం ద్వారా నిరుపేద ముస్లింలకు లాభం జరగడం లేదని, అందుకోసమే కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ సవరణల కోసం బిల్లు తెచ్చిందన్నారు. ఈ సమావేశంలో బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, నాయకులు శశివర్ధన్‌రెడ్డి, పైండ్ల శ్రీనివాస్, మల్లం యశ్వంత్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాజవర్ధన్‌రెడ్డి

బీజేపీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న రాజశేఖర్

తొర్రూరు: బీజేపీని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేసుకోవాలని బీజేపీ జనగామ జిల్లా ప్రధాన కార్యదర్శి దుబ్బా రాజశేఖర్‌గౌడ్ అన్నారు. డివిజన్ కేంద్రంలో బుధవారం బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. పార్టీ అర్బన్ అధ్యక్షుడు పైండ్ల రాజేష్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రాజశేఖర్‌గౌడ్ మాట్లాడారు. బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈనెల 22 వరకు అంబేద్కర్ జయంతి, గావ్ చలో–బస్తీ చలో వంటి కార్యక్రమాలు కొనసాగించాలన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ అమలు చేస్తున్న సబ్‌కా సాత్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్ మంత్రాన్ని సాకారం చేసేందుకు బీజేపీ కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ పూసాల శ్రీమా, నాయకులు రచ్చ కుమార్, పల్లె కుమార్, రవిబాబు, చలువాది సత్యనారాయణ, సోమశేఖర్ పాల్గొన్నారు.

వంటగ్యాస్ ధరల పెంపుపై నిరసన



తొర్రూరు: నిరసన తెలుపుతున్న నాయకులు

కేసముద్రం: కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్, చమురు ధరల పెంపుపై మున్సిపాలిటీ కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి చిన్న చంద్రన్న, ఆవుల కట్టయ్య, కందాల రంగయ్య, మల్లేశం పాల్గొన్నారు.

తొర్రూరు: వంట గ్యాస్, చమురు ధరలు పెంచి కేంద్ర ప్రభుత్వం సామాన్యులపై భారం మోపుతోందని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు తమ్మెర విశ్వేశ్వరరావు అన్నారు. ఈమేరకు సీపీఐ, సీపీఎంల ఆధ్వర్యంలో బుధవారం డివిజన్ కేంద్రంలోని గాంధీ సెంటర్‌లో నిరసన తెలిపారు. సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. వేర్వేరు కార్యక్రమాల్లో మాస్‌లైన్ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి, ముంజంపల్లి వీరన్న, మండల కార్యదర్శి ఎండీ యాకూబ్ పాల్గొన్నారు.

కురవి: కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం కురవిలోని గుడిసెంటర్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకుడు గంధసిరి శ్రీనివాస్, నాయకులు కట్ల కృష్ణయ్య, దేవ, మాలు, సిరియా పాల్గొన్నారు.

పరిహారం అందేలా చూస్తాం..

- ఎమ్మెల్యే మురళీనాయక్

గూడూరు: ప్రమాదవశాత్తు జరిగిన విద్యుదాఘాతంలో మూడు ఎకరాల మొక్కజొన్న కంకుల కుప్ప దగ్ధమైన సంఘటన మండలంలోని గుండెంగ శివారు నల్లబోడుతండా సమీప పంట చేనులో మంగళవారం రాత్రి జరిగింది. బుధవారం ఉదయం పంట చేను వద్దకు చేరుకున్న బాధిత రైతు నందానాయక్ కాలిబూడిదైన పంటను చూసి కన్నీటి పర్యంతమయ్యాడు. సుమారు రూ. లక్ష 50 వేల విలువ పంట దగ్ధమైనట్లు, వ్యవసాయ, విద్యుత్, రెవెన్యూ అధికారులు సహకరించి రైతుకు ఆర్థిక సహాయం చేయాలని గ్రామస్తులు కోరారు.

మండలంలోని గుండెంగ శివారు నల్లబోడుతండా సమీపంలో విద్యుదాఘాతంతో దగ్ధమైన మొక్కజొన్న పంట రాశిని ఎమ్మెల్యే మురళీనాయక్ బుధవారం పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరును రైతు ద్వారా అడిగి తెల్సుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యుత్ అధికారులతో జరిగిన నష్టంపై పంచనామ జరిపించి ప్రభుత్వం ద్వారా రైతు నందానాయక్‌కు నష్టపరిహారం అందిస్తానని హామీ ఇచ్చారు. అదే విధంగా ప్రభుత్వ పథకాలను అందిస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు చీకటి శ్రీనివాస్‌గౌడ్, మాజీ సర్పంచ్ మంగీలాల్‌నాయక్, రైతులు పాల్గొన్నారు.

బాధితులకు అండగా ఉంటాం



కేసముద్రం: దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

కేసముద్రం: అకాలవర్షానికి నష్టపోయిన బాధితులను ఆదుకుంటామని ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. గత రెండురోజులుగా కురిసిన వడగండ్ల వానతో నష్టపోయిన పంటలను బుధవారం మండలంలోని నారాయణపురం, పీక్లాతండా, బిచ్యానాయక్‌తండా, రాజీవ్‌నగర్‌తండా, రంగాపురం, బేరువాడతోపాటు ఆయా గ్రామాల్లో పరిశీలించారు. కార్యక్రమంలో కేసముద్రం మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, పీసీసీ సభ్యుడు గుగులోతు దస్రూనాయక్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి, మండలఅధ్యక్షుడు అల్లం నాగేశ్వర్ రావు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

చిన్నగూడూరు: ఉచిత కంటి ఆపరేషన్ శిబిరాలు నిర్వహించడంలో ప్రగతి సేవా సమితి సేవలు అభినందనీయమని తహసీల్దార్ మహబూబ్ అలీ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శంకర కంటి ఆస్పత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ, ప్రగతి సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత కంటి ఆపరేషన్ శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామారావు, ప్రగతి సేవా సమితి వ్యవస్థాపకులు గద్దల జాన్, ఎస్సై ప్రవీణ్ కుమార్, ఎంఈఓ రవికుమార్, మెడికల్ ఆఫీసర్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

పంటల పరిశీలన

గూడూరు: అకాల వర్షానికి, ఈదురు గాలులకు పాడైన పంటలకు ఎమ్మెల్యే సహకారంతో రైతులకు నష్టపరిహారం అందేలా కృషి చేస్తానని నెక్కొండ వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ ఎడ్ల నరేష్‌రెడ్డి అన్నారు. మండలంలో మంగళవారం రాత్రి భారీ ఈదురుగాలులతో కురిసిన వర్షానికి చేతికి వచ్చిన మొక్కజొన్న, వరి పంటలు దెబ్బతిన్నాయి. బుధవారం ఉదయం సమాచారం అందుకున్న ఆయన వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులతో కలిసి మండల కేంద్రంతో పాటు సీతానగరం, భూపతిపేట, కోబల్‌తండ, పొనుగోడు, బొద్దుగొండ, మట్టెవాడ, బొల్లెపల్లి గ్రామాలలో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఓ అబ్దుల్‌మాలిక్, ఏఈఓ అలేఖ్య, ఉద్యానవన శాఖ అధికారిణి శాంతిప్రియ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్న గ్రామస్తులు

నర్సింహులపేట: మండలంలోని పడమటిగూడెం గ్రామంలో ఆకేరు వాగు నుంచి అక్రమంగా ఇసుకను ట్రాక్టర్లలో రవాణా చేస్తుండగా మంగళవారం అర్ధరాత్రి గ్రామస్తులు ట్రాక్టర్లను అడ్డుకున్నారు. ట్రాక్టర్ల చప్పుడుకు నిద్రలేకుండా పోతుందని గ్రామస్తులు అడ్డుకోవడంతో గొడవ జరిగింది.

ఒకరి అరెస్ట్

కురవి: మాజీ సర్పంచ్ భర్త గుగులోత్ కిషన్‌నాయక్ మృతికి కారణమైన కాకులబోడుతండాకు చెందిన ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కి తరలించినట్లు కురవి ఎస్సై గండ్రాతి సతీష్ బుధవారం తెలిపారు. కురవి పోలీసుస్టేషన్ పరిధిలోని కాకులబోడుతండా మాజీ సర్పంచ్ భర్త గుగులోత్ కిషన్ నాయక్ ఈనెల 6వ తేదీన తండా పెద్దల సమక్షంలో పంచాయతీ మాట్లాడుతుండగా బానోత్ హరియా, తన భార్య హాచి, కొడుకు సుమన్ గొడవ పడ్డారని తెలిపారు. గుగులోత్ కిషన్‌నాయక్‌ను చావు, చచ్చిపో అని తిట్టడం, చెప్పులతో, కాళ్లతో కొట్టగా అవమానం భరించలేక ఈనెల 8వ తేదీన ఉదయం 9గంటలకు తన ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరివేసుకుని చనిపోయినట్లు తెలిపారు. గుగులోత్ కిషన్ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి గుగులోత్ కిషన్ మృతికి కారణమైన బానోత్ సుమన్, బానోత్ హరియా, బానోత్ హచిలను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై పేర్కొన్నారు.

సంక్షిప్త సమాచారం

సద్వినియోగం చేసుకోవాలి

తొర్రూరు రూరల్: అంగన్‌వాడీ సెంటర్ల ద్వారా అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఏసీడీపీఓ ఇందిరమ్మ కోరారు. మండలంలోని ఖానాపురం గ్రామంలో బుధవారం పోషకాహారంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఆర్థికసాయం

పెద్దవంగర: మండల కేంద్రానికి చెందిన జర్నలిస్టు శ్రీశైలం తండ్రి కందుల సోమయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. బుధవారం ఎస్సై క్రాంతి కిరణ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి, రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు.

గ్యారంటీల అమలులో విఫలం

గార్ల: ఎన్నికల ముందు హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలు పథకాలు అమలు చేయడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కందునూరి శ్రీనివాస్ ఆరోపించారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో అలువాల సత్యవతి, రాజారావు, పెద్దవెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలి

పెద్దవంగర: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు రంగు రాములు గౌడ్, దొంగరి మహేందర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్ మండల అధ్యక్షుడు బొమ్మెరబోయిన సుధాకర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు.

కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి

చిన్నగూడూరు: ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేసి రైతులు పండించిన పంటలను కొనుగోలు చేయాలని చిన్నగూడూరు మండల సేవాలాల్ సేన అధ్యక్షుడు బాదావత్ సురేష్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు.

రుణమాఫీ లబ్ధిదారుల జాబితా ఏర్పాటు

కురవి: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు చేసిన రుణమాఫీ లబ్ధిదారుల జాబితాను సీరోలు మండల వ్యవసాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో బుధవారం కొత్తూరు(సీ) గ్రామంలోని ప్రధాన సెంటర్‌లలో ఏర్పాటు చేశారు.

పాఠశాల భూమిని కాపాడాలి

మహబూబాబాద్ అర్బన్: మానుకోట నడిబొడ్డున ఉన్న కంకర బోర్డు జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల ప్రభుత్వ భూమిని జిల్లా విద్యాశాఖ అధికారి సందర్శించి, కాపాడాలని డీఎస్‌ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు జి. సూర్యప్రకాశ్, ఎల్‌ఎస్‌ఓ జిల్లా అధ్యక్షుడు శివవర్మ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని కంకర బోర్డు జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలను బుధవారం వారు సందర్శించారు. కార్యక్రమంలో నాయకులు ప్రవీణ్, జవహర్‌లాల్, రమేష్, నరేష్, చంటి, వినయ్ పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత



కురవి: రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత అని కురవి, సీరోలు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంబటి వీరభద్రం గౌడ్, కొండపల్లి కరుణాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం కురవి, సీరోలు మండలాలలోని పలు గ్రామాలలో బుధవారం జై బాపు.. జై భీమ్.. జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా ర్యాలీలు, సమావేశాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్‌లు ఇస్లావత్ సుధాకర్, వెంకట్ రెడ్డి, రజనీకాంత్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పేదలకు అందుతున్న సంక్షేమ ఫలాలు

డోర్నకల్: కాంగ్రెస్ పాలనలో సంక్షేమ ఫలాలు పేదలకు చేరుతున్నాయని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. మండలంలోని బూరుగుపాడు, దుబ్బతండా, కన్నెగుండ్ల గ్రామాల్లో బుధవారం జైబాపు, జై భీమ్, జై సంవిదాన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల శ్రీనివాస్‌యాదవ్, మండల అధ్యక్షుడు డీఎస్ జగదీష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాసం శేఖర్, నాయకులు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడిగా సత్యనారాయణ

డోర్నకల్: ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడిగా డోర్నకల్‌కు చెందిన సీనియర్ ఫొటోగ్రాఫర్ భీమనబోయిన సత్యనారాయణ(చిన్ని) ఎంపికయ్యాడు.

ఎమ్మెల్యేను విమర్శించే అర్హత లేదు

బయ్యారం: నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్యను విమర్శించే అర్హత మాజీ ఎమ్మెల్యే హరిప్రియకు లేదని మండల కాంగ్రెస్ నాయకుడు సోమేష్ అన్నారు. బుధవారం బయ్యారంలో ఆయన మాట్లాడారు. హరిప్రియ రాజకీయ ప్రయోజనం కోసం ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం చేయడం సరికాదన్నారు.

విజయవంతం చేయండి

గార్ల: గార్ల మండలంలో నేడు ఎమ్మెల్యే కోరం కనకయ్య పలు అభివృద్ధి పథకాలకు శంకుస్థాపన చేయనున్నందున, ఎమ్మెల్యే పర్యటనలో పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రామారావు బుధవారం పిలుపునిచ్చారు.

చిరస్మరణీయుడు ‘చంద్ర’

గార్ల: కమ్యూనిస్టు యోధుడు చంద్ర రాజేశ్వరరావు పేదల గుండెల్లో చిరస్మరణీయుడిగా నిలిచారని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కట్టెబోయిన శ్రీనివాసరావు అన్నారు. బుధవారం మద్దివంచ గ్రామంలో రాజేశ్వరరావు వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి రమేశ్, జనార్దన్, లోకేష్ పాల్గొన్నారు.

పరిహారం అందించాలి

నెల్లికుదురు: అకాల వడగళ్ల వర్షాలకు నష్టపోయిన పంటలు, దెబ్బతిన్న ఇళ్లకు వెంటనే నష్టపరిహారం అందించాలని సీపీఐ మండల కార్యదర్శి బైస స్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. ఈమేరకు తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ కె.రాజుకు బుధవారం వినతిపత్రం అందించారు.


రాంజీ గోండుకు నివాళి

కొత్తగూడ: బ్రిటీష్ వారిపై ప్రథమ తిరుగుబాటుకు శ్రీకారం చుట్టిన ఆదివాసీ పోరాట యోధుడు రాంజీ గోండు వర్ధంతి సందర్భంగా బుధవారం ఆదివాసీ సంఘాల నాయకులు మండలకేంద్రంలో ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ జాతీయ అధ్యక్షుడు దాట్ల నాగేశ్వర్‌రావు, తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్, ఆదివాసీ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకుల నిర్మాణం

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలంలోని అమనగల్ గ్రామంలోగల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థుల తాగునీటి అవసరాలు తీర్చాలని ఎన్నారై వద్ది బుచ్చిరెడ్డి రెండు మంచినీటి ట్యాంకులను నిర్మించాడు. బుధవారం పాఠశాల హెచ్‌ఎం సత్య శంకర్ మాట్లాడుతూ.. బుచ్చిరెడ్డి తమ తల్లిదండ్రులు వద్ది చిన్నవీరారెడ్డి, వెంకటమ్మ జ్ఞాపకార్థం రూ.40వేలు వెచ్చించి రెండు వాటర్ ట్యాంకులను నిర్మించడం అభినందనీయమని పేర్కొన్నారు

కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలి



మహబూబాబాద్ అర్బన్: జేఎన్టీయూ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని అధ్యాపకులు సురేష్, ప్రసాద్ కోరారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో బుధవారం అధ్యాపకులు నిరసన చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ 21ని రద్దు చేసి కాంట్రాక్ట్ అధ్యాపకులకు న్యాయం చేయాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జేఎల్‌లు, డీఎల్‌లు, పాలిటెక్నిక్ కాంట్రాక్ట్ అధ్యాపకులను ఎలా రెగ్యులర్ చేసిందో.. అదే విధంగా కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను రెగ్యులర్ చేయాలన్నారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ అధ్యాపకులు తిరుపతి, ప్రసాద్, సత్య, నజిముద్దీన్, సైదా, అజయ్ కుమార్ పాల్గొన్నారు.